సాక్షి
నంద్యాల
ఆదివారం ၊ 17 ၊ డిసెంబర్ ၊ 2023



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకునేందుకు శనివారం మహానందికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.



దూసుకొచ్చిన మృత్యువు

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె వంతెనపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మృతులిద్దరూ బనగానపల్లె వాసులు. 8లో▸



ప్రియురాలిని చంపి..

కర్నూలులోని ఓ లాడ్జిలో దారుణం చోటు చేసుకుంది. ఓ వ్యక్తి ప్రియురాలిని కత్తితో పొడిచి చంపి తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు నంద్యాల క్రీడాకారుడు



హరిహరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల (న్యూటౌన్): జాతీయ స్థాయి అండర్–14 క్రికెట్ పోటీలకు నంద్యాల మోడల్ స్కూల్ క్రీడాకారుడు కేవీ హరిహరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫరహానాబేగ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన అండర్–14 రాష్ట్రస్థాయి ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం జిల్లా జట్టుపై ఉమ్మడి కర్నూలు జట్టు సత్తా చాటి విజేతగా నిలిచిందని, ఈ మ్యాచ్‌లో కేవీ హరిహరణ్ 38 పరుగులు చేయడంతో పాటు, రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకంగా మారాడన్నారు. ప్రతిభ చాటడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యారన్నారు. ఫిబ్రవరిలో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అభినందించారు.

మహానందిలో 23న వైకుంఠ ఏకాదశి వేడుకలు



మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో ఈనెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మహానందిలో కొలువైన శ్రీ సీతా కోదండరాముల వారికి లక్ష పుష్పార్చన పూజలు వైభవంగా ఉంటాయన్నారు. అనంతరం ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం ఎంతో పుణ్యఫలమని వివరించారు.

చిరుధాన్యాలకు 'మద్దతు'

- జిల్లాలో 35 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగు
- మద్దతు ధరతో దిగుబడుల సేకరణకు కసరత్తు
- ఆర్‌బీకేల్లో విక్రయ రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు



గుళ్లదూర్తి సమీపంలో కళకళలాడుతున్న కొర్ర పంట

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. రైతులు, ప్రజలకు ప్రయోజనం అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసిన రైతులకు ఆర్థికంగా ఆదాయం కల్పించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికందే వరకు వివిధ రకాల సబ్సిడీలు వర్తింప చేయడమే కాకుండా చిరుధాన్య పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే దిగుబడులను కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 17,390 ఎకరాల్లో చిరుధాన్య పంటలైన జొన్న, సజ్జ, కొర్ర సాగుకావాల్సి ఉండగా 16,932 ఎకరాల్లో, రబీ సీజన్‌లో 18,202 ఎకరాల్లో సాగు చేశారు. పంట కాలం పూర్తయి దిగుబడులు చేతి కందటంతో ఆయా మండలాల్లో రైతులు కోత, నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం దిగుబడులను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో దిగుబడులను కొనుగోలు చేయనున్నారు. ఈ మేరకు దిగుబడి అంచనా వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా సేకరించి జనవరి మొదటి వారం నుంచి కొనుగోలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

మద్దతు ధరతో ఊరట

విత్తనానికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పంటలకు మద్దతు ధర ప్రకటించాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో చిరుధాన్యాలను అధికారులు కొనుగోలు చేయనున్నారు. ఇందులో జొన్నలు క్వింటా రూ. 3,255, రాగులు రూ. 3,046, కొర్రలు రూ. 2,500లతో పౌరసరఫరాల సంస్థ నేరుగా కొనుగోలు చేయనుంది. ఇప్పటికే జిల్లాలో చిరుధాన్యాల పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయి.. ఏ మేరకు దిగుబడులు వస్తున్నాయనే వివరాలను వ్యవసాయశాఖ అధికారుల నుంచి సేకరించారు. ఇప్పటికే జొన్న, రాగుల విక్రయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. మిగిలిన చిరుధాన్య పంటలను జనవరి నుంచి కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో విక్రయ రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆయా సీజన్లలో సాగు చేసిన ఈ క్రాప్ ఆధారంగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయనుంది. రైతులకు ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా నేరుగా రైతుల పొలాల వద్దకే పౌర సరఫరాల సంస్థ అధికారులు వెళ్లి దిగుబడులను కొనుగోలు చేయనున్నారు. దీంతో రైతులకు రవాణా సమస్య లేకుండా ప్రభుత్వమే ఖర్చులు చెల్లించనుంది.

అవగాహనతో పెరిగిన వినియోగం

పూర్వ కాలం పేదలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకునేవారు. ప్రస్తుతం ఆధునిక జీవన శైలిలో వచ్చిన మార్పులతో నేడు సంపన్నవర్గాలకు ఆహారంగా మారింది. బీపీ, షుగర్, మలబద్ధకం, తదితర రోగాల నివారణకు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. దీంతో చిరుధాన్యాలకు డిమాండ్ పెరిగింది. అధిక ధర చెల్లించి వీటిని కొనుగోలు చేసే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో చిరుధాన్య పంటలైన కొర్ర, సజ్జ, ఆరికల, రాగులు, సామలు, ఊదలను విస్తారంగా సాగు చేసేవారు. ఆయా పంట ఉత్పత్తులతో ఆహారం చేసుకుని తినేవారు. వరి సాగు రావడంతో క్రమేపి చిరుధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాలసాగుకు ప్రోత్సాహం కల్పిస్తుండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే క్రమంలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించడంతో ఏటా చిరుధాన్య పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పూర్వ వైభవం

చిరుధాన్యాలు ఒకప్పుడు పేదల, మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారం. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు వీటి వినియోగం ఎక్కువగానే ఉండేది. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఉరుకులు, పరుగుల జీవితం, ఆధునిక పోకడలు, నిత్యం పనిఒత్తిడిలో పడి ప్రజలు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారు. జీవితాన్ని బిజీగా గడుపుతూ వేళ కాని వేళ దొరికిన జంక్‌ఫుడ్ తినడానికి అలవాటు పడిజీవన పంథాను మార్చుకుంటున్నారు. ఇలాంటి ఆహారాన్ని తీసుకుని ప్రజలు వివిధ రోగాల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. వైద్య నిపుణుల సలహా మేరకు ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాలు ఉన్న చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. చిరుధాన్య పంటలకు పూర్వ వైభవం సంతరించేందుకు ప్రభుత్వం సాగును ప్రోత్సహిస్తోంది.

రెండు ఎకరాల్లో జొన్న సాగు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నాకున్న రెండు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. విత్తనాలు, రసాయన ఎరువులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేలు వెచ్చించాను. వాతావరణం అనుకూలించి పంటలో మంచి దిగుబడులు వస్తాయని భావిస్తున్నాను. ప్రభుత్వం ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. దిగుబడులు చేతికందిన వెంటనే కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తాను.

– చిన్న కుళాయిస్వామి, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

ఈ క్రాప్ ఆధారంగా కొనుగోలు



ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన చిరుధాన్య దిగుబడులను జిల్లా పౌరసరఫరాశాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే జొన్న, రాగులు విక్రయించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. పంట నమోదు ఆధారంగా పంట ఉత్పత్తులను విక్రయిస్తారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తులను విక్రయించాలి.

– సుధాకర్, ఏడీఏ, కోవెలకుంట్ల

భూమా దూరం.. ఫరూక్ అయోమయం

- ఫలించని ఫరూక్ రాజీ చర్చలు
- నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశానికి భూమా డుమ్మా

నంద్యాల: నంద్యాల తెలుగుదేశం పార్టీ నేతల మధ్య ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. నంద్యాల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను నియమించినప్పటి నుంచి వారిలో విభేదాలు భగ్గుమంటున్నాయి. భూమా, ఫరూక్‌లు వేర్వేరు గ్రూపులుగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్‌ఎండీ ఫరూక్ భూమా ఇంటికి వెళ్లి సహకరించాలని కోరినా ఫలితం కనిపించ లేదు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర శివానంద రెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి హాజరు కాకపోవడంతో ఎన్‌ఎండీ ఫరూక్ కంగుతిన్నారు. ఫరూక్‌కు వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇస్తే సహకరించే ప్రసక్తే లేదని భూమా వర్గీయులు బహిరంగంగానే చెబుతున్నారు. టీడీపీ ఇన్‌చార్జ్‌గా భూమా బ్రహ్మానందరెడ్డిని ఆ పదవి నుంచి తొలగించినప్పటికీ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే టీడీపీ కండువా వేసుకోకుండానే తిరుగుతుండటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. నంద్యాల టీడీపీ నాయకులు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఏ వర్గం వెంట వెళ్లాలో అర్థం కాక అయోమయంలో పడిపోయారు.

శ్రీశైలంలో 55 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శనివారం సాయంత్రానికి 55.2544 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శుక్రవారం నుంచి శనివారం వరకు జలాశయం నుంచి 6,833 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. తెలంగాణలోని భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 1.622 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 3,388 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

మరిగిస్తే.. మరింత విషం

- మరిగించిన నూనెలతో ప్రమాదకర జబ్బులు
- ఒక సారి వాడిన వంట నూనె మరోసారి వాడరాదు
- టీపీసీ 25 దాటితే టాక్సిన్లు (విష పదార్థాలు) విడుదల
- రెస్టారెంట్లు, హోటళ్లలో నూనె పునర్వినియోగానికి అడ్డుకట్ట
- వినియోగించిన నూనె సేకరణకు స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ ఒప్పందం



నంద్యాల(సిటీ): మనిషి మారుతున్న ఆహారపు అలవాట్లను ఆసరా చేసుకుని నంద్యాల జిల్లాలో పుట్టగొడుగుల్లా హోటళ్లు, రెస్టారెంట్‌లు వెలుస్తున్నాయి. కొందరు వంట చేసుకోలేక, మరికొందరు కుటుంబం, స్నేహితులతో కలిసి సరదాగా బయట రెస్టారెంట్, హోటళ్లలో నోరూరించే విందు చేయాలని అనుకునేవారు ఎక్కువయ్యారు. ఈ క్రమంలో కొందరు హోటళ్ల నిర్వాహకులు రుచి మాటున నాణ్యత ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. కల్తీ పదార్థాల వినియోగంతో పాటు వంట నూనెల పలుమార్లు వినియోగించి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఒక సారి వినియోగించిన నూనెనే మరిగించి చివరి చుక్క అయిపోయే వరకు వినియోగిస్తున్నారు. నూనె పునర్వినియోగించడంతో విషం కంటే ప్రమాదమనే విషయంపై అవగాహన లేక పలుమార్లు వినియోగిస్తున్నారు. దీంతో ప్రమాదకర జబ్బులతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. నంద్యాల జిల్లాలో అధిక శాతం హోటళ్లలో జరుగుతున్న ఈ తంతుతో వేలాది మంది ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఆహారంలో వాడే నూనెలను పదే పదే మరిగించి వాడటం వల్ల టీపీసీ (టీపీసీ అంటే టోటల్ పోలార్ కాంపౌండ్స్) మోతాదు పెరుగుతుంది. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల మేరకు వీటి మోతాదు నూనెల్లో 25 మించి ఉండకూడదు. ఇంతకు మించి ఉంటే నూనెల్లో టాక్సిన్స్ (విష పదార్థాలు) విడుదల అవుతాయి. పట్టణంలో ఇటీవల నిర్వహించిన పలు హోటళ్లు, రెస్టారెంట్‌లలో ఈ టీపీసీ నమోదు 30 నుంచి 35 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. తినే పదార్థాలు రుచికరంగా ఉండవచ్చు కానీ విష పదార్థాలు శరీరంలో గుట్టలుగా పేరుకుపోతాయన్న విషయం చాలా మందికి తెలియదు.



నంద్యాలలోని రెస్టారెంట్‌లో నూనెను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

టీపీసీ మోతాదు మించితే వచ్చే జబ్బులు..

- ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం
- గుండె జబ్బులు ➡ హైపర్‌టెన్షన్
- గ్యాస్ట్రిక్ డిజార్డర్స్‌తో పేగులకు రంధ్రాలు పడటం
- కాలేయం సంబంధిత వ్యాధులు సోకడం
- 120 డిగ్రీల కంటే అధిక సెల్సియస్‌లో వేడి చేసే బంగాళదుంపల చిప్స్ వల్ల అధిక ప్రమాదం
- టీపీసీ వల్ల నూనెలు ట్రైగ్లిజరాయిడ్స్‌గా మారి శరీరానికి హాని కలిగే అవకాశం

32 హోటళ్లకు నూనె డబ్బాలు..

ఒకసారి వాడిన నూనెను మళ్లీ వాడకుండా మిగిలిన నూనెను కొనుక్కునేందుకు (స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్) ఓ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇదివరకే సుమారుగా 32 హోటళ్లకు నూనె సేకరణ కోసం డబ్బాలు ఏర్పాటు చేశారు. ఈ నూనెను లీటర్ రూ. 25ల చొప్పున కొంటున్నారు. ఈ రీ యూజ్డ్ నూనెలను బయోడీజిల్‌గా వినియోగిస్తారు. త్వరలోనే ఈ డబ్బాలను జిల్లాలోని ప్రతి హోటల్, రెస్టారెంట్‌లలో అందుబాటులో ఉంచి వినియోగించిన నూనెలను సేకరిస్తారు. దీనివల్ల ఆరోగ్యానికి హాని చేసే నూనెలను నియంత్రించవచ్చు.



హోటల్ యజమానులకు నూనెలను సేకరించేందుకు డబ్బాలు అందజేస్తున్న దృశ్యం

అధికారులు తరచూ తనిఖీ చేయాలి



కొందరు హోటళ్లు, రెస్టారెంట్ యజమానులతో పాటు తోపుడు బండ్ల పైన బజ్జీ, చికెన్ పకోడ, చేపల ఫ్రై వ్యాపారులు అధికంగా మరిగించిన నూనెను వినియోగిస్తున్నారు. ఆహార భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు మరింతగా తనిఖీలు చేపట్టాలి. వంట నూనెలను పలుమార్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి.

– మహమ్మద్ ఫైజుల్లా, వెలుగోడు

అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం



హోటళ్లలో నూనెల పునర్వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల ఆరోగ్య సంరక్షణకు హోటల్, రెస్టారెంట్ యాజమాన్యాలు తప్పని సరిగా సహకరించాలి. జిల్లాలో కొన్ని చోట్ల టీపీసీ మోతాదుకు మించి నూనెలు వినియోగించినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ నూనెలను కొనేందుకు స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ ముందుకు వచ్చింది. ఇప్పటికే 32 హోటళ్లలో వినియోగించిన నూనెను సేకరించడానికి ప్రత్యేక డబ్బాలు అందుబాటులో ఉంచాం.

– కె.కూర్మానాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్



సంక్షేమ బావుటా

జగన్ మేలును ఎన్నటికీ మరువను



నాకు ప్రమాదవశాత్తూ ఒక కన్ను పూర్తిగా దెబ్బతినింది. డాక్టర్లు తొలగించి గాజు కన్ను వేశారు. రెండో కంటి చూపు కూడా సరిగా లేదు. పింఛన్ కోసం గత ప్రభుత్వ హయాంలో అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ కరుణించ లేదు. అర్హత ఉన్నా పింఛన్ ఇవ్వలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పింఛన్ కోసం మా గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేశాను. ఎవరు సిఫారసు చేయకుండానే పింఛన్ వచ్చింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ పెంచి పేదలకు ఎంతో సాయం చేశారు. ఆసుపత్రి, మందుల ఖర్చులకు ఒకరిపై ఆధారపడకుండా చేశారు. ఇప్పుడు రూ. 2,750 తీసుకుంటున్నా. వచ్చే నెల నుంచి రూ. 3 వేలు ఇస్తారంటా. పేదలకు మంచి చేసే జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నటికీ మరువను.

– శీలం మార్తమ్మ, గువ్వలకుంట్ల గ్రామం

సొంతింటి కల నెరవేరింది



ఇంటి పట్టా ఇవ్వడం.. ఇల్లు నిర్మించుకోవడం.. కొత్తింటికి చేరడం.. అంతా చూస్తే కలేమో అనిపిస్తోంది. జగనన్న పాలనలో మా కుటుంబానికి ఉన్న సొంతింటి కల నెరవేరింది. దాదాపుగా 25 ఏళ్లు అద్దె ఇళ్లల్లో ఎన్నో కష్టాలు పడ్డాం. కార్పెంటర్‌గా పని చేయగా వచ్చే ఆదాయం అంతా ఇల్లు గడవడానికి, అద్దె చెల్లింపులకు సరిపోయేది. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన నవరత్నాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయి. మేము ఇల్లు కట్టుకుని ఇప్పుడు సంతోషంగా ఉన్నాం. పెద్ద పాప రెండవ తరగతి, చిన్నపాప నర్సరీ చదువుతున్నారు. అమ్మఒడి పథకంతో పాటు ఇతర సంక్షేమ పథకాలతో కొంత ఊరట చెందుతున్నాం. ఇలాంటి సంక్షేమ పథకాలను అమలు చేసే జగనన్నకు ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి.

– షేక్ ఫారూఖ్, విశ్వనగర్, నంద్యాల

గొంతువాపు వ్యాధిపై అప్రమత్తత అవసరం

నంద్యాల(సెంట్రల్): శీతాకాలం కారణంగా పశువుల్లో గొంతు వాపు వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ప్రాంతీయ పశువైద్య కేంద్రం సహాయ సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి సూచించారు. చలిగాలుల వల్ల గాలిలో తేమశాతం పెరిగి పశువులకు శ్వాస సంబంధ వ్యాధులు, తీవ్ర చలి వల్ల పశువులు ఆహారాన్ని నమలలే కపోవటంతో అజీర్ణ వ్యాధులు, శిలీంద్రాల కారణంగా చర్మవ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. వ్యాధి సోకిన 32 గంటల వ్యవధిలో లక్షణాలు కనిపిస్తాయన్నారు. పశువు తీవ్రమైన ఆయాసంతో రొప్పుతూ గురకపెడ్తూ ముక్కు నుంచి, నోటి నుంచి నురగ వంటి స్రవాలను కారుస్తుంటుందన్నారు. ఏవైనా సందేహాలుంటే దగ్గర్లోని పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నల్లమలలో ప్లాస్టిక్ నిషేధం

మహానంది: నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమల్లోకి తెస్తున్నట్లు నంద్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్ కుమార్ రెడ్డి తెలిపారు. మహానందిలోని నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు. జనవరి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దుతామన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులు పడేయవద్దని సూచించారు.

25న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి అరుణాచల క్షేత్రానికి ఈ నెల 25వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ప్రయాణికుల సౌకర్యార్థం అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ సర్వీసు సోమవారం ఉదయం 6 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు మంగళవారం సాయంత్రం అరుణాచలం నుంచి బస్సు బయలుదేరి వేలూరు మీదుగా నంద్యాల చేరుకుంటుందన్నారు. కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయాల్లో భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలుగా బస్సును ఆయా క్షేత్రాల్లో నిలుపుతామన్నారు. ఈ సర్వీసుకు చెందిన టికెట్లను బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్, apsrtconline.inలో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

విద్యార్థుల వివరాల నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు

నంద్యాల(న్యూటౌన్):10వ తరగతి విద్యార్థుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ పరీక్షలకు నంద్యాల జిల్లా నుంచి హాజరయ్యే విద్యార్థుల నామినల్ రోల్స్‌లో విద్యార్థి వివరాలు, ల్యాంగ్వేజీల ఎంపిక, మాధ్యమం, సబ్జెక్ట్ కోడ్, ఒకేషనల్ కోడ్స్, ఐడెంటిఫికేషన్ మార్క్స్, పాస్‌పోర్ట్ ఫొటోపై విద్యార్థి సంతకం తదితర అంశాలలో తప్పులు లేకుండా ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో సరిచేసుకోవాలన్నారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సంజామల: గృహ నిర్మాణాలు వేగవంతం చేసుకునేలా లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని జిల్లా హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ముక్కమల్ల, ఆకుమల్ల గ్రామాల్లోని జగనన్న కాలనీలను డీఈ కృష్ణారెడ్డితో కలసి ఈఈ శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ముక్కమల్ల గ్రామంలో జగనన్న కాలనీ వెల్‌కం ఆర్చ్ స్లాబ్ లెవల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో పడుతున్నాయని, లబ్ధిదారులు త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చైతన్యపరచాలన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఆటోను ఢీకొన్న ఐచర్ లారీ
- లారీల మధ్యలో నుజ్జునుజ్జయిన ఆటో
- ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడి మృతి
- మృతులిద్దరూ బనగానపల్లె వాసులు



రెండు లారీల మధ్యలో నుజ్జునుజ్జయిన ఆటో

బొమ్మలసత్రం: అతివేగం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. నంద్యాల పట్టణంలోని నూనెపల్లె వంతెనపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. గర్భిణిగా ఉన్న భార్యకు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని సొంతూరుకు తిరిగి వెళ్తున్న ఓ వ్యక్తిని మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కూడా దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె పట్టణానికి చెందిన ఇక్బాల్ (36), ఆఫ్రిన్ దంపతులకు అప్స అనే రెండేళ్ల చిన్నారి ఉంది. ఇతను సొంతూరులోనే చెప్పుల దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆఫ్రిన్ రెండవ సారి గర్భం దాల్చి నాలుగు నెలలు నిండటంతో నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యురాలి వద్ద చూయించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ఇక్బాల్‌తో పరిచయమున్న భాస్కర్ ఆటోలో కుటుంబంతో సహా బయలుదేరారు. నూనెపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నూనెపల్లి బ్రిడ్జి నుంచి ఆటో కిందకు వస్తుండగా ముందున్న లారీ బ్రిడ్జి కుడివైపుకు నెమ్మదిగా తిరుగుతుండగా భాస్కర్ ఆటోను నిలిపాడు. అంతలోనే వెనుక నుంచి వేగంగా వస్తున్న ఐచర్ వాహనం ఆటోను బలంగా ఢీకొని ఎదురుగా ఉన్న లారీ వద్దకు ఈడ్చుకెళ్లింది. దీంతో ఆటో రెండు లారీల మధ్య చిక్కుకుని నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్ భాస్కర్ (42), ఇక్బాల్ (36) అక్కడికక్కడే మృతిచెందారు. ఇక్బాల్ భార్య ఆఫ్రిన్‌కు, కూతురు అప్సకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోలో చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన ఐచర్ వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.



మృతి చెందిన ఆటో డ్రైవర్ భాస్కర్, ఇక్బాల్

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం

నంద్యాల: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ - 2023 నూతన కమిటీని డీఆర్‌ఓ, డీఈఓ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన ప్రతి విద్యార్థి మంచి క్రమశిక్షణతో పాటు ఉన్నత స్థాయి విద్యలు అభ్యసించే అవకాశం ఉందన్నారు. విపత్తులు సంభవించినప్పుడు స్కౌట్ విద్యార్థులు ముందుండి సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్ ప్రారంభించాలని నూతన కమిటీ ప్రతిపాదించింది. స్కౌట్‌లో చేరిన విద్యార్థులకు ఐదు శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు ఐదేళ్లకు ఓసారి ఎన్నికలు జరుగుతాయని, ప్రతి పాఠశాల సభ్యత్వం కోసం రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ డీఈవో బేగ్, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లియో ఆంటోనీ, చిన్నయ్య, స్కౌట్ మాస్టర్స్ గైడ్ కెప్టెన్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నూతన కమిటీ ఎన్నిక

భారత్ స్కౌట్స్ గైడ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తూర్పు లింగారెడ్డిని డీఆర్‌ఓ పుల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఉపాధ్యక్షులుగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, చీఫ్ కమిషనర్‌గా డీఈఓ సుధాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ మార్గాన్ని అనుసరిద్దాం



మాట్లాడుతున్న చైర్మన్ విక్టర్‌ప్రసాద్

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

నంద్యాల(అర్బన్): దేశ ప్రజల మధ్య ఉన్న అసమానతలు తొలగించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గాన్ని అనుసరిద్దామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో శనివారం సాయంత్రం అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఏ కులానికో, మతానికో సంబంధించిన వారు కాదని, అందరివాడని అన్నారు. దేశంలో కుల వివక్షతో దళితులు మగ్గుతున్నారన్న విషయాన్ని గుర్తించి సమాజంలో అంటరానితనాన్ని సమూలంగా మార్చేసేందుకు మహనీయుడు ఎంతో కృషి చేశారన్నారు. అనగారిన వర్గాలు, దళితుల కోసం అలుపెరగని పోరాటం చేసిన అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే ఐజయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి దేశానికి అందించిన అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమైనవన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్‌కుమార్, నక్కా ఓబులేసు, మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షులు మేకల లింగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరించిన అంబేడ్కర్ నూతన విగ్రహం

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌జాం

శ్రీశైలం: శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డులో శనివారం సాయంత్రం దాదాపు గంటన్నర పాటు ఇరువైపుల వాహనాల రాకపోకలు నిలిచి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దోర్నాల నుంచి శ్రీశైలం వస్తున్న బస్సు, శ్రీశైలం నుంచి తెనాలికి వెళ్తున్న కారు శిఖరేశ్వరం దాటిన తర్వాత బయ్యన్న సెలకు వెళ్లే మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అయితే కారులో ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రమాద స్థలంలో కారు రహదారి మధ్యలో నిలిచిపోవడంతో గంటన్నర పాటు 5 కి.మీ మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్నపల్లెలో చోరీ

- ఒకే బంకులో మూడోసారి

మహానంది: ఒకరిపై ఆధారపడకుండా చిన్న బంకు నిర్వహిస్తూ బతుకుతున్న ఓ వృద్ధురాలి బంకులో దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన హుసేన్‌బీ పంక్చర్ షాపు నిర్వహించుకుంటూ పెట్రోల్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి దుకాణం తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుమారు 30 లీటర్ల పెట్రోల్‌తో పాటు రూ. 5వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో రెండు సార్లు ఇలాగే చోరీకి పాల్పడ్డారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న హుసేన్‌బీ

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

మహానంది: ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన శనివారం బండిఆత్మకూరు మండలం పార్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన రంగమ్మ (70) ఉదయాన్నే పాలుతెచ్చేందుకు వెళ్తుండగా.. ఓ ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొట్టి.. అనంతరం లక్ష్మిరెడ్డి ఇంటి గోడను గుద్దుకొని ఆగిపోయింది. ఈ సంఘటనలో రంగమ్మకు తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ మల్లికార్జున ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ప్రియురాలిని చంపి ప్రియుడు ఆత్మహత్య



విజయకుమార్(ఫైల్)

కర్నూలు(టౌన్)/నందికొట్కూరు: వివాహేతర సంబంధం ఇరువురి ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన శనివారం కర్నూలు నగరంలోని వుడ్ ల్యాండ్స్ లాడ్జిలో చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న విజయకుమార్(35) వృత్తిరీత్యా అకౌంటెంట్. బీటెక్ పూర్తి చేసిన ఇతను పదేళ్ల క్రితం పట్టణానికి చెందిన ముస్లిం అమ్మాయిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. మిడుతూరు మండలం నాగలూటికి చెందిన రుక్సానా(45)కు పట్టణానికి చెందిన కార్పెంటర్‌తో 2001లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఒకే కాలనీలో ఉంటున్న విజయకుమార్, రుక్సానా మధ్య ఏర్పడిన పరిచయం మూడేళ్లుగా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాగా శుక్రవారం ప్రియుడు రుక్సానాకు ఫోన్ చేసి కర్నూలులోని వుడ్‌ల్యాండ్స్ లాడ్జిలో ఉన్నట్లు చెప్పాడు. దీంతో బాబుకి ఆరోగ్యం బాగోలేదని కర్నూలుకు వెళ్లి ఆస్పత్రిలో చూపిస్తానని భర్తకు చెప్పి రూ.5 వేలు తీసుకుని బయలుదేరింది. అయితే కుమారుడిని ప్రభుత్వాసుపత్రి వద్ద వదిలి ఆమె కనిపించకుండా పోయింది. రాత్రి అయినా రాకపోవడంతో కుమారుడు కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఇదే సమయంలో ప్రియుడు విజయ్‌కుమార్ ఆమె కుమారుడికి ఫోన్ చేసి ఇద్దరం లాడ్జిలో ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. ఫోన్ పే ద్వారా రూ.300 అకౌంట్‌లో వేశాడు. అయితే ఏ లాడ్జి అనే సమాచారం లేకపోవడంతో కుమారుడు అన్ని చోట్ల వెతికాడు. చివరకు వుడ్‌ల్యాండ్స్ వద్ద పార్కు చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తుపట్టి లాడ్జిలో విచారించారు. విజయ్‌కుమార్ అక్కడే ఉన్నట్లు తెలుసుకుని రూమ్ వద్దకు వెళ్లి ఎన్నిసార్లు పిలిచినా తలుపు తెరువ లేదు. రూమ్ సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శనివారం లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సైతం ఎంత ప్రయత్నించినా రూం తలుపులు తెరవకపోవడంతో బద్దలు కొట్టారు. ఇద్దరూ విగత జీవులుగా కనిపించారు.

ప్రియురాలిని చంపి ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆధారాలు

ఈ ఘటన వివాహేతర సంబంధం వల్లే జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించాం. ఇరువురి మధ్య గొడవ జరిగి రుక్సానాను కత్తితో పొడిచి చంపాడు. ఆ తరువాత క్రిమి సంహారక మందు తాగి తనూ ఆత్మహత్య చేసుకున్నట్లు ఘటనా స్థలంలో ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. హత్య, ఆత్మహత్యకు సంబంధించి కారణాలపై విచారణ చేస్తున్నాం.

– మురళీధర్ రెడ్డి, మూడవ పట్టణ సీఐ

భయం వీడితే ఏ భాషైనా సులువే

మహానంది: భయం వీడి పట్టు సాధిస్తే ఏ భాషైనా.. ఎక్కడైనా సులువుగా మాట్లాడవచ్చని మహానంది వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి తెలిపారు. ఆంగ్లంలో నాలుగు నైపుణ్యాలు అంశంపై నాలుగురోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం అంశాలపై నాలుగు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ సరోజినీదేవి మాట్లాడుతూ విద్యార్థులు తమ సబ్జెక్టులతో పాటు ఆంగ్లం నేర్చుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ముందు భయాన్ని వీడాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఐడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, మెంబర్ ఎంఎస్ రాహుల్, ప్రొఫెసర్లు డాక్టర్ ఎల్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సరోజినీదేవి



నమ్మకాన్ని పెంచాయి – అక్షయ

నాలుగురోజుల పాటు ఇంగ్లిష్ బాషలో శిక్షణా కార్యక్రమం నాకు ఎంతో దోహదపడింది. కళాశాల అధ్యాపకులు, ట్రైనర్లు బోధించిన అంశాలు సులువుగా అర్థం అవడంతో పాటు నలుగురిలో మాట్లాడాలంటే కలిగే భయాన్ని పోగొట్టాయి. నాలుగు రోజుల పాటు నేర్చుకున్న జీవననైపుణ్యాలు నా మీద నాకు నమ్మకాన్ని పెంచాయి. ఇక నుంచి ఎక్కడైనా ఇంగ్లిషులో సులువుగా మాట్లాడగలననే నమ్మకం వచ్చింది.

అనుమతి కొంత.. తవ్వేది కొండంత



పట్టా భూమిలో మట్టిని తరలిస్తున్న దృశ్యం

- నిబంధనలకు పాతరేస్తున్న కాంట్రాక్టర్
- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

జూపాడుబంగ్లా: కర్నూలు – ఆత్మకూరు నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు దక్కించుకున్న టీడీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ రైతుల పట్టాభూముల్లో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. వైఎస్సార్‌జిల్లా మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా సుధాకర్ యాదవ్‌కు చెందిన పీఎస్‌కే కంపెనీ పనుల టెండర్‌ను దక్కించుకుంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ యథేచ్ఛగా మైనింగ్ పాల్పడుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పారుమంచాల రెవెన్యూ పరిధిలో 10.40 ఎకరాల పొలంలో గ్రావెల్ తవ్వకానికి మైనింగ్ అధికారుల వద్ద అనుమతులు పొందానని చెబుతూ యథేచ్ఛగా నిబంధనలకు పాతర వేస్తున్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం పట్టా భూముల్లో, ప్రభుత్వ భూముల్లో కేవలం 2 మీటర్ల లోతుకు మించి తవ్వకాలు చేపట్టరాదు. అయితే ఈ కాంట్రాక్టర్ పది అడుగుల మేర గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. తవ్వకాల విషయంపై జూపాడుబంగ్లా తహసీల్దార్ పుల్లయ్య యాదవ్‌ను వివరణ కోరగా గ్రావెల్ తవ్వకానికి అనుమతి ఇచ్చామని, అయితే మైనింగ్ అధికారులు ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇచ్చారనే విషయం తమకు తెలిదన్నారు. జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఫోన్‌లో ఈ విషయంపై మాట్లాడేందుకు నిరాకరించారు.



గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్